క్లుప్తంగా

శివుడికి మంత్రి పూజలు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహారాష్ట్రలోని నాసిక్ నది సమీపంలో గల ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రమైన త్రయంబకేశ్వర్ ఆలయంలో శివుడిని మంగళవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు మంత్రికి ఆహ్వానం పలికారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్వాగతోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అర్జున్, బషీర్, జావిద్, అరుంధతి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి



కోయిల్‌కొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. మంగళవారం మండలంలోని పల్లుతండాలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. పని జరుగుతున్న ప్రాంతాల్లో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కూలీలకు సరైన వసతులు కల్పించాలన్నారు. టెంట్లు, తాగునీటి వసతి తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన


కోయిల్‌కొండ: క్షయవ్యాధి నిర్మూలనపై మండలంలోని అంకిళ్లలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రజిత, ఎంపీటీసీ రాఘవ్‌నాథ్ వైద్య సిబ్బందితో కలిసి మాట్లాడారు. అనంతరం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకట్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, వార్డుమెంబర్ ఆశమ్మ, బాలరాజ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హజ్రత్ బాగ్మార్‌సాబ్ గంధోత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: హజ్రత్ సయ్యద్‌షా అసదుల్లా హుస్సేని ఉరఫ్ బాగ్మార్‌సాబ్ రహెమతుల్లా అలై దర్గా ఉర్సు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గంధోత్సవాన్ని మంగళవారం చేపట్టారు. గంధోత్సవ ఊరేగింపు పాతపాలమూర్ ముతవల్లీ బాబుమియా ఇంటి నుంచి ప్రారంభమై జిల్లా జైలుఖానా, వన్‌టౌన్ చౌరస్తా, అశోక్‌టాకీస్, క్లాక్‌టవర్, పాన్ చౌరస్తా, రాంమందిర్ చౌరస్తా నుంచి దర్గా వరకు చేరుకుంది. అనంతరం దర్గాలో పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు కరాటే పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చి పతకాలు సాధించిన వారిని మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఇటీవల జరిగిన సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్–2023లో 7వ తరగతికి చెందిన ఆఫ్రిన్, కళ పాల్గొనగా, ఆఫ్రిన్ గోల్డ్ మెడల్, కళ కాపర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ సత్యనారాయణ, విద్యార్థినులను ఉపాధ్యాయులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్, ఎస్ఎంసీ చైర్మన్ తిరుపతయ్య పాల్గొన్నారు.

నిరుపయోగంగా వైకుంఠధామాలు

- సొంత భూముల్లోనే అంత్యక్రియలు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



జమాల్‌పూర్‌లో నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామం

కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం పల్లెప్రగతిలో భాగంగా గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు నిరుపయోగంగా మారాయి. నిర్మాణాలు పూర్తయ్యి ఏడాది గడుస్తున్నా ఆయా గ్రామాల్లో ప్రజలు వాటిని వినియోగించుకునేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నిరుగారుతోంది. రూ.లక్షలతో నిర్మించిన వైకుంఠధామాలు కొన్ని గ్రామాల్లో అలంకారప్రాయంగా మారాయి.

44 గ్రామ పంచాయతీల్లో..

మండలంలోని 44 గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో వైకుంఠధామాన్ని రూ.12.50లక్షలతో నిర్మించారు. కొన్ని గ్రామాల్లో వైకుంఠధామాల్లో కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో బర్నింగ్‌షెడ్, టాయిలెట్స్, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించలేదు. విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయలేదు. దీంతో వైకుంఠధామాలు వినియోగంలోకి రాకుండాపోయాయి. కేవలం మండలంలోని ఆచార్యపూర్, కోత్లాబాద్, కనాయపల్లి, పారుపల్లి గ్రామాల్లో మాత్రమే వైకుంఠధామాలు వినియోగంలో ఉన్నాయి. మిగతా గ్రామాల్లో ప్రజలు సొంత భూముల్లోనే అంత్యక్రియలను నిర్వహిస్తున్నారు.

అవగాహన కరువు..

పలు గ్రామాల్లో ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో వైకుంఠధామాలు నిరుపయోగంగా మారాయి. దీనికితోడు వైకుంఠధామాలను గ్రామాలకు దూరంగా నిర్మించడంతో ప్రజలు వాటిని వినియోగించేందుకు ఆసక్తి చూపడం లేదు. వైకుంఠధామాల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి..



గ్రామాల్లోని ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతోనే వైకుంఠధామాలు నిరుపయోగంగా మారుతున్నాయి. వైకుంఠధామాల్లో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించాలి.

– రామస్వామి, కోయిల్‌కొండ

సద్వినియోగం చేసుకోవాలి..



ప్రభుత్వం ప్రజల అవసరాల దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైకుంఠధామాలను ప్రజలు వినియోగించడం లేదు. వైకుంఠధామాలను వినియోగించేందుకు ముందుకు రావాలి.

– జయరాములు, ఎంపీడీఓ, కోయిల్‌కొండ

పేదల జీవితాల్లో వెలుగు



కోటకదిరలో వృద్ధుడికి కంటి అద్దాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్

మహబూబ్‌నగర్ రూరల్: కంటి వెలుగుతో పేదల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతుందని రైతుబంధు మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కోటకదిరలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ మల్లు రమ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతిఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ మస్తాన్, పంచాయతీ కార్యదర్శి మాధవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సిములు, మల్లప్ప పాల్గొన్నారు.

అడ్డాకుల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ అన్నారు. మూసాపేట మండలం వేములలో మంగళవారం ఎంపీపీ గూపని కళావతితో కలిసి ఆయన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 18ఏళ్ల వయసు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, లక్ష్మీ నర్సింహ యాదవ్, రఘుపతిరెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం



చిల్వేర్‌లో విద్యార్థుల కోసం ఆటోను ఏర్పాటు చేసిన ప్రదీప్‌రెడ్డి

మిడ్జిల్: మండలంలోని అయ్యవారిపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న చిల్వేర్ విద్యార్థులకు ఇటీవల ఆర్టీసీ బస్సు బంద్ కావడంతో నిత్యం మూడు కిలోమీటర్ల దూరం కాలినడకన పాఠశాలకు వస్తున్నారు. విద్యార్థుల పరిస్థితిని గమనించిన అయ్యవారిపల్లికి చెందిన దాత పండుగ ప్రదీప్‌రెడ్డి మంగళవారం నుంచి ఉచితంగా ఆటోను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా గ్రామంలో వదిలిపెడతారని తెలిపారు. విద్యార్థుల సౌకర్యం కోసం ఆటోను ఏర్పాటు చేసిన దాతకు విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వయం పరిపాలన దినోత్సవం



జిల్లా కేంద్రంలోని జీనియస్ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

జడ్చర్ల టౌన్: మండలంలోని శ్రీనివాస్‌పల్లితండా ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా చరణ్, ఎంఈఓగా నందిని, డీఈఓగా చందు, ఉపాధ్యాయులుగా నరేష్, వరుణ్, మణికంఠలు వ్యవహరించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు బాబునాయుడు, నాగరాణి, విద్యా కమిటీ చైర్మన్ రాజు నాయక్ అభినందించారు.

పోల్కంపల్లిలో..

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎంగా రామకృష్ణ, ఉపాధ్యాయులుగా సాయి కీర్తన, నందిని, వైష్ణవి, శ్రీధర్, భానుప్రసాద్, క్రశాంత్, వెంకటేష్, అరవింద్, రమేష్ వ్యవహరించారు. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.మన్నెం, ఉపాధ్యాయులు రాఘవేంద్ర, పుష్పలత, సీఆర్‌పీ వసంత, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

జీనియస్ మైండ్స్ పాఠశాలలో..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని జీనియస్ మైండ్స్ పాఠశాలలో మంగళవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు.

చౌదర్‌పల్లిలో..

దేవరకద్ర: మండలంలోని చౌదర్‌పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మంగళవారం ఘనంగా స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. డీఈఓగా అఖిల, ఎంఈఓగా ప్రణీత్, హెచ్‌ఎంగా భరత్, ఉపాధ్యాయులుగా సంగీత, నందిని, వైశాలి, స్వప్న, అక్షిత మరి కొందరు వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పుష్ప, భారతి తదితరులు పాల్గొన్నారు.



పోల్కంపల్లిలో ఉపాధ్యాయులైన విద్యార్థులు



చౌదర్‌పల్లిలో..

మహిళా సాధికారతకు కృషి చేయాలి

పాలమూరు: శ్రీ జయరామ గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం జయరామ మోటార్స్ మారుతీ షోరూంలో మహిళా ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయరామ గ్రూప్ డైరెక్టర్ బెక్కరి శిల్పరెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక సాధికారిత కల్పించేందుకు ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ బెక్కరి జయలక్ష్మి, పూర్ణిమ, ఇందిర, శివలీల, కవిత, స్వర్ణలత, నవిత పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక



జడ్చర్ల టౌన్: నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 7మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ మంజులాదేవి మంగళవారం తెలిపారు. 8వ తరగతికి చెందిన తులసివర్ధన్, దినేష్, రాకేష్, సుదీప్తి, దివ్య, పావని, ఆయేషాసుల్తాన ఎంపికైన వారిలో ఉన్నారని, వీరికి నాలుగేళ్ల పాటు ప్రతి నెలా రూ.వెయ్యి స్కాలర్‌షిప్ అందుతుందని వెల్లడించారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాసిత్, ఉపాధ్యాయులు వివేకానంద, గోవింద్‌నాయక్, అలీం, ఇబ్రహీం, భాగ్యమ్మ ఉన్నారు.

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలం బండ్రపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని నందిని ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. విద్యార్థి ఎంపికపై సర్పంచ్ సతీష్, ఉపాధ్యాయులు జయరాం, రాఘవేంద్ర, గాయత్రి, రుక్మిణి, జయమ్మ, పుష్పలత, రమాదేవి అభినందించారు.

గ్రామకంఠం భూమి ఎక్కడ?



మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని ధర్మాపూర్‌లో గల గ్రామకంఠం భూమిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. చాలాకాలంగా ఇది మా భూమి అంటూ నర్వ బాల్‌రెడ్డి అనే వ్యక్తి దరఖాస్తు చేసుకోగా, తెలిసో, తెలియకో గ్రామ పంచాయతీ కార్యదర్శి నిస్సార్ అహ్మద్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్ జారీ చేశాడు. అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు గ్రామకంఠం భూమి విషయంలో ద్వంద వైఖరి అవలంభించడం వల్ల పంచాయతీ కార్యదర్శి సస్పెండ్ అయ్యాడు. అయినా ఈ భూమి వ్యవహారం తేలలేదు. గ్రామ సర్పంచ్ ఒక పార్టీ కాగా, అధికార పార్టీకి చెందిన నాయకులు మరోపక్షంగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఒకరిపై ఒకరు రాజకీయ ఆధిపత్యం కోసం పాకులాడుతున్నారు. ఈ విషయంలో గ్రామ బీజేపీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం వల్ల పంచాయతీ కార్యదర్శి సస్పెండ్‌కు గురైన విషయం పాఠకులకు తెలిసిందే.

ఎస్టీలుగా గుర్తించాలి



జడ్చర్ల: వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని వాల్మీకి మేధావుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎంటీ బాలకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లపల్లి, మాచారం గ్రామాల్లో మంగళవారం ఇంటింటికీ వాల్మీకి సందేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ చెల్లప్ప కమీషన్‌ను తెలంగాణ ప్రభుత్వం కాలయాపన చేసి కేంద్రానికి సకాలంలో బిల్లు పంపలేదన్నారు. కార్యక్రమంలో శివలింగం, ఆనంద్, తిరుపతయ్య, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు



జడ్చర్లలోని బాలికల ప్రభుత్వ కళాశాలలో నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

జడ్చర్ల టౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం మండలంలోని నాలుగు కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు అధికారులు ఏర్పాటు చేశారు. కో ఎడ్యుకేషన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 258 మంది, బాలికల ప్రభుత్వ కళాశాలలో 331, విశ్వవికాస్ 392, వైష్ణవి కళాశాలలో 371 మంది విద్యార్థుల కోసం కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొదటి రోజున 1,052 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు జరిగే పరీక్షలకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

భూత్పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ విజయభాస్కర్ గుప్తా తెలిపారు. మొదటి సంవత్సరం 248 మంది, ద్వితీయ సంవత్సరం 211 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

వ్యాధులపై జాగ్రత్తలు అవసరం



తాటికొండలో మాట్లాడుతున్న జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ మహ్మద్ రఫీక్

భూత్పూర్: ప్రజలు వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారి డా.మహ్మద్ రఫీక్ అన్నారు. మంగళవారం మండలంలోని తాటికొండలో ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి పూట చెమటలు పట్టడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటివి క్షయవ్యాధి లక్షణాలు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయికుమార్, వైద్యాధికారి డా.అబ్దుల్ రబ్, సీహెచ్ఓ రామయ్య, జిల్లా క్షయ కోఆర్డినేటర్ గోపాల కృష్ణయ్య, సూపర్‌వైజర్లు రాజు, యాసీన్, రాఘవేందర్, యాదమ్మ, సుధాకర్, పుష్పలీల, ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గండేడ్: మండలంలోని రంగారెడ్డిపల్లి వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న తహసీల్దార్ జ్యోతి కావలికార్లను ఘటనా స్థలానికి మంగళవారం పంపించారు. కావలికార్లు అక్కడికి వెళ్లి పట్టుకునే ప్రయత్నం చేయగా, తప్పించుకుని పారిపోయారు. కావలికార్లు తీసిన ఫొటోల ఆధారంగా రెండు ట్రాక్టర్లకు రూ.5,500ల చొప్పున జరిమానా విధించారు. కాగా, అందులో ఒక ట్రాక్టర్ మహిళా సమాఖ్యకు సంబంధించిందని, అక్రమంగా వాడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యార్థిని అదృశ్యం

జడ్చర్ల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎడ్ల సువర్ణ(20) కనిపించకుండా పోయిందని సీఐ రమేశ్‌బాబు తెలిపారు. సీఐ కథనం మేరకు.. బాదేపల్లి ఎస్‌వీపీ నగర్‌లో నివాసం ఉంటున్న ఎడ్ల సువర్ణ ఈనెల 11న కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో విద్యార్థిని తల్లి అరుణ మంగళవారం ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, రాజు అనే వ్యక్తితో కలిసి ఉంటుందని అనుమానం వ్యక్తం చేయడంతో ఆ దిశగా విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి తాళం



బుద్దారంలో తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

హన్వాడ: మండలంలోని బుద్దారం అంగన్‌వాడీ కేంద్రం మూతపడింది. ఐదు రోజులుగా అంగన్‌వాడీ కేంద్రం తెరుచుకోకపోవడంతో చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు. ఇక్కడ పనిచేసే అంగన్‌వాడీ టీచర్, ఆయాల మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో కేంద్రానికి తాళం వేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై అంగన్‌వాడీ టీచర్ పద్మను వివరణ కోరేందుకు సంప్రదించగా, ఆమె అందుబాటులో లేరు. ఇదిలా ఉండగా, ఇదే గ్రామంలోని మరో అంగన్‌వాడీ కేంద్రంలోనూ ఇదే పరిస్థితి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమయ పాలన పాటించకుండా ఇష్టారీతిగా విధులను నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు.

చర్యలు తీసుకుంటాం..

విధులకు గైర్హాజరైన అంగన్‌వాడీ టీచర్లకు వేతనం నుంచి కోతలు విధిస్తాం. బుద్దారంలో టీచర్లు సరిగా విధులు నిర్వర్తించడం లేదని మా దృష్టికి వచ్చింది. ఇది వరకే హెచ్చరించినా తీరు మారడం లేదు. ఉన్నతాధికారులకు తెలిపి తగిన చర్యలు తీసుకుంటాం.

– యాదమ్మ, సూపర్‌వైజర్, బుద్దారం

మహా హుండీ ఏర్పాటు



హుండీకి పూజలు చేస్తున్న అర్చకుడు

అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో వెలిసిన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జాతరను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తెప్పించిన మహా హుండీని ఏర్పాటు చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి హుండీని ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా, ఆలయం వద్ద జాతర కొనసాగుతోంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, ఆలయ ఉద్యోగి అనంతసేన్ రావు తదితరులు ఉన్నారు.

ఆటో అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

గండేడ్: ఆటో అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నంచర్లకు చెందిన శ్రీకాంత్, పగిడ్యాల్‌కు చెందిన అరవింద్‌లు ఇంటర్ చదువుతున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రతిభా కళాశాలలో హాల్‌టికెట్లు తీసుకొని సల్కర్‌పేట్ వైపు వెళ్తుండగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే దారి వద్దకు రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేసి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్సులో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.